సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



ఆశావర్కర్ల సమ్మె నోటీస్

తమ సమస్యలు పరిష్కరించాలని పేర్కొంటూ జిల్లావ్యాప్తంగా ఆశావర్కర్లు అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు.

- 9లో ▸



ఆయన సేవలు మరువలేనివి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆయన సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.5 /24.5

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం చలిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

ఇక పెద్దనోటు గాయబ్!



- ఈనెల 30వ తేదీతో మార్పిడికి ముగియనున్న గడువు
- రూ. 2 వేల నోటు ఉండేది వారం రోజులే..
- బ్యాంకుల్లో జమ చేసి మార్చుకునే అవకాశం

సాక్షి, కామారెడ్డి : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రూ.2 వేల నోటును రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే రూ. 2 వేల నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకునేందుకు ఇచ్చిన గడువు ఈనెల 30తో ముగియనుంది. గత మేనెల 19న రూ. 2 వేల నోట్లను రద్దు చేస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. ప్రజల దగ్గర ఉన్న నోట్లను మార్చుకునేందుకు అవకాశం ఇచ్చింది. మే 23 నుంచి సెప్టెంబర్ 30 దాకా బ్యాంకుల్లో జమ చేయడం ద్వారా నోట్లను మార్చుకోవచ్చని వెల్లడించింది. మొదట్లో జనం తమ దగ్గర ఉన్న పెద్ద నోట్లను బ్యాంకుల్లో జమ చేసుకునేందుకు బారులు తీరారు. ఎక్కువ సమయం ఇవ్వడంతో దాదాపు అందరూ నోట్లను మార్చుకున్నారు. అయితే బ్లాక్ మనీ ఉన్న వారు రకరకాల మార్గాల ద్వారా పెద్ద నోట్లను మార్పిడి చేసుకున్నారన్న ప్రచారం జరిగింది. జిల్లాలో రూ. కోట్ల విలువైన రూ. 2 వేల నోట్లు మార్పిడి జరిగింది. ఆయా బ్యాంకుల్లో డిపాజిట్లు చేసుకోవడం ద్వారా నోట్లను మార్చుకున్నారు. నోట్ల మార్పిడికి నిబంధనలు ఉండడంతో వివిధ మార్గాల ద్వారా పెద్ద నోట్లను బ్యాంకుల్లో జమ చేసుకున్నారు. అక్కడక్కడా కొందరు మిగిలిపోయిన వారు మార్పిడి చేసుకునేందుకు ఈ నెల 30 వరకు అవకాశం ఉంది. దీంతో బ్యాంకులకు వెళ్లి డిపాజిట్ చేసుకోవడం ద్వారా నోట్లను మార్చుకోవచ్చని బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి.

చెల్లుబాటు కావు..

పెద్దనోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకునేందుకు ఇచ్చిన గడువు ఈనెల 30వ తేదీతో ముగియనుంది. అంటే మిగిలింది వారం రోజులే అన్నట్లు. ఈ వారం రోజుల్లో డిపాజిట్ చేసుకోకుండా ఉంటే నోట్లు చెల్లకుండాపోతాయి. ఇంకా ఎవరి వద్దయినా పెద్దనోట్లు ఉంటే వెంటనే డిపాజిట్ చేసుకోవాలని బ్యాంకర్లు సూచిస్తున్నారు. 30వ తేదీ అనంతరం రూ. 2 వేల నోట్లు చెల్లవంటున్నారు.

రూ.కోట్లలో మార్పిడి..

రూ. 2 వేల నోట్లను మార్చుకునేందుకు ఇచ్చిన అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకున్నారు. రూ. కోట్లల్లో దందాలు సాగించే వివిధ వ్యాపార వర్గాలు తాము దాచుకున్న పెద్దనోట్లను మార్పిడి చేసుకుని బయటపడ్డారు. ఆలస్యం చేస్తే ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయేమోనన్న భావనతో మే, జూన్ మాసాల్లో భారీ ఎత్తున మార్పిడి చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో రూ. వందల కోట్ల విలువైన రూ. 2 వేల నోట్లను మార్చుకున్నట్లు ప్రచారం జరిగింది. నిబంధనల ప్రకారం పెద్ద మొత్తంలో నోట్లు మార్పిడి చేసుకోవడం ఇబ్బంది అవుతుందన్న ఉద్దేశ్యంతో వివిధ మార్గాల ద్వారా మార్పిడి చేసుకున్నారు.

ఉనికిలో ఉన్నది ఆరున్నరేళ్లే..

రూ. 2 వేల నోటు ఆరున్నర ఏళ్లు మాత్రమే ఉనికిలో ఉంది. 2016 నవంబర్ 8న ఆర్‌బీఐ రూ. 2 వేల నోటును మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ఏడాది మే 19న రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అంటే దాదాపు ఆరున్నరేళ్ల ఉనికిలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. పెద్దనోట్లు వచ్చినవి వచ్చినట్లే దాచేసుకున్నారు. దీంతో కొంత కాలంగా రూ. 2 వేల నోట్లు చలామణిలో కనిపించలేదు. పెద్దఎత్తున పెద్ద నోట్లను బ్లాక్ చేయడంతో ఉనికి లేకుండా పోయింది. బడాబాబులు రూ. 2 వేల నోట్ల కట్టలను భారీ ఎత్తున నిల్వ చేసుకోవడంతో ఆర్‌బీఐ దృష్టి సారించింది. చివరకు పెద్ద నోటును రద్దు చేయడానికి నిర్ణయం తీసుకోవడంతో బడాబాబులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. నోట్ల మార్పిడికి అవకాశం ఉండడంతో రకరకాల పద్ధతుల్లో బ్యాంకుల్లో డిపాజిట్లు చేసుకుని గండం నుంచి బయటపడ్డారు. అయితే పెద్ద నోటు జీవిత కాలం మాత్రం ఆరున్నరేళ్లే అనేది స్పష్టమవుతోంది.

హస్తిన వైపు హస్తం నేతల చూపు!

సాక్షి, కామారెడ్డి : కాంగ్రెస్ టికెట్ల కోసం కసరత్తు జరుగుతుండడంతో ఆ పార్టీ నేతలు హస్తిన వైపు చూస్తున్నారు. టిక్కెట్ ఆశిస్తున్న వారితోపాటు వారి అనుచరులు కూడా ఏం జరుగుతుందోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కామారెడ్డిలో మాత్రమే టికెట్ల గొడవ లేదు. మిగితా మూడు చోట్ల పలువురు టిక్కెట్ ఆశిస్తున్నారు. దీంతో తీవ్ర పోటీ నెలకొంది. స్క్రీనింగ్ కమిటీ వడపోత షురూ చేయడంతో టిక్కెట్ ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఎల్లారెడ్డి నుంచి టిక్కెట్ ఆశిస్తున్న మదన్ మోహన్ ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడ టిక్కెట్ ఆశిస్తున్న సుభాష్ రెడ్డి మాత్రం స్థానికంగానే ఉన్నారు. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అనుచరుడైన సుభాష్ రెడ్డి టిక్కెట్ తనకే వస్తుందన్న ధీమాతో ఉన్నారు. బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో కూడా టిక్కెట్లు ఆశించేవారు ఎక్కువ మందే ఉన్నారు. ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. అయితే ఢిల్లీలో ఏం జరుగుతుందోనన్న దానిపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే హన్మంత్ సింధే



జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద(జుక్కల్) : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి పేరు ప్రతిష్టలు సాధించాలని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. బిచ్కుందలో గురువారం మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో జ్యోతి వెలిగించి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు స్నేహభావం పెంపొందించడంతో పాటు దేహదారుఢ్యానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని జ్యోతిబా పూలే పాఠశాలల విద్యార్థులు బిచ్కుందలో నిర్వహిస్తున్న క్రీడల్లో 350 మంది విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం గురుకులాలు ప్రారంభించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తుందన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, చెస్ వివిధ రకాల క్రీడలు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేకాధికారి భరత్ భూషణ్ తెలిపారు. మూడు రోజులు క్రీడలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అశోక్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

కామారెడ్డిలో కాంగ్రెస్ సత్తా చాటాలి

- మాజీ మంత్రి షబ్బీర్‌అలీ



కాంగ్రెస్‌లో చేరిన వారితో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ

దోమకొండ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని, సీఎం కేసీఆర్ ఓటమి ఇక్కడి నుంచే మొదలవ్వాలని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం దోమకొండ మండలానికి చెందిన ముదిరాజ్ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కేసీఆర్ ఓటమి కామారెడ్డి నుంచే మొదలవుతుందన్నారు. బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. తన హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు సీతారం మధు, శ్రీకాంత్, బాల్‌రాజ్, లింబాద్రి, గంగాధర్, చందు పాల్గొన్నారు.

డీఎంఈ పరిధిలోకి జిల్లా కేంద్రాస్పత్రి

- ఆదేశాలు జారీ చేసిన టీవీవీపీ కమిషనర్

కామారెడ్డి టౌన్ : తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధీనంలో ఉన్న కామారెడ్డి జిల్లా కేంద్రాస్పత్రిని ఇక డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) స్వాధీనం చేసుకుంటున్నట్లు గురువారం జీవో విడుదల చేశారు. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ డాక్టర్ అజయ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన 9 మెడికల్ కళాశాలల పరిధిలోని హెడ్ క్వార్టర్‌లో ఉన్న జిల్లా ఆస్పత్రులన్నింటినీ డీఎంఈ పరిధిలోకి విలీనం చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రాస్పత్రితో పాటు ఎంసీహెచ్ ఆస్పత్రి కూడా డీఎంఈ పరిధిలోకి విలీనం చేశారు. దీంతో ఇప్పుడివరకు డీసీహెచ్‌ఎస్, టీవీవీపీ పరిపాలనలో ఉన్న జిల్లా కేంద్రాస్పత్రి ఇక మెడికల్ కళాశాలకు స్వాధీనం చేయనున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జిల్లా కేంద్రాస్పత్రి డీసీహెచ్‌ఎస్, సూపరింటెండెంట్లు ఎల్లారెడ్డి ఏరియా ఆస్పత్రికి లేక బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుంది. దోమకొండ సీహెచ్‌సీ 100 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేస్తే వీరంతా దోమకొండకు వెళ్లే అవకాశముంది. ఇక జిల్లా కేంద్రాస్పత్రి, ఎంసీహెచ్‌లు కామారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఆధీనంలో ఉంటాయి. గురువారం ఆదేశాలు రావడంలో కామారెడ్డి జిల్లా కేంద్రాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న టీవీవీపీ వైద్యాధికారులు, సిబ్బంది అయోమయానికి గురవుతున్నారు. వీరంతా ఎల్లారెడ్డి ఏరియా ఆస్పత్రి లేదా బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది.

అన్నివర్గాల వారికి సమన్యాయం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి
- అడిగినా సమాచారమివ్వని అధికారులపై ఆగ్రహం



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ నెం.1గా నిలుస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రూ. 2.88 కోట్లతో గ్రామంలోని ప్రధాన రహదారి, సీసీ రోడ్లు, రూ. 60 లక్షలతో ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదులు, రూ. 1.36 కోట్లతో 27 డబుల్ బెడ్‌రూంలను, రూ. 33.14 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోడౌన్లను ప్రారంభించారు. రూ. 1.75 కోట్లతో బొమ్మన్‌దేవ్ పల్లి నుంచి హాజీపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 15 లక్షలతో నిర్మించే కురుమ సంఘం భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ వివరాలు, విద్యార్థుల సమాచారం జీపీ కార్యదర్శి చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈవో ఉండాల్సిన కార్యక్రమంలో ఏవో సమాధానం ఇవ్వడంతో అసహనం వ్యక్తం చేశారు. అధికారులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఉద్యోగం చేసే ఉద్దేశం లేకపోతే మానుకోవాలని హెచ్చరించారు. ఎంపీపీ పాల్త్య విఠల్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ జన్నుబాయి ప్రతాప్ సింగ్, మండల పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ మాజిద్ ఖాన్, ఎంపీటీసీ నారాయణ రెడ్డి, నాయకులు శ్రీనివాస్, కిషోర్‌యాదవ్,పవన్ గౌడ్ తదితరులున్నారు.

జోరుగా.. హుషారుగా..

- మెడికల్ కళాశాలలో ప్రారంభమైన తరగతులు
- మొదటి రోజు ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు
- స్వాగతం పలికిన అధ్యాపకులు



మొదటిరోజు కళాశాలకు వచ్చిన విద్యార్థులకు గులాబీ పువ్వులు ఇచ్చి స్వాగతం పలికిన ప్రొఫెసర్లు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో ప్రారంభమైన నూతన మెడికల్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైంది. ఫస్ట్ బ్యాచ్ ఫస్ట్ డేతో కళాశాల ప్రారంభమైంది. విద్యార్థులకు గురువారం మొదటి రోజు తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు కళాశాలలో, తరగతి గదితో తొలి అడుగుపెట్టారు. కళాశాలలో మొదటి రోజు లెక్చరర్ హాల్‌లో పరిచయ వేదిక, ఘన స్వాగతం కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ పెరుగు వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు, సిబ్బంది, విద్యార్థులు పరిచయం చేసుకున్నారు. అధ్యాపకులు నూతన విద్యార్థులకు గులాబీ పువ్వులు, చాక్లెట్లతో ఘనంగా స్వాగతం పలికారు. ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు.

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆనందంతో గడిపారు. 100 విద్యార్థులకు గాను మొదటి రోజు 80 మంది హాజరయ్యారు. వారికి అశోక్‌నగర్ కాలనీలో లేడీస్, బాయ్స్ హాస్టల్‌లు వేర్వేరుగా ఏర్పాటు చేశారు. మొదటి రోజు కళాశాలలో అడుగు పెట్టిన సందర్భంగా నూతన మెడికల్ విద్యార్థులు 'సాక్షి'తో తన అనుభూతిని పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పెరుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డాక్టర్లు కావాలనే లక్ష్యంతో విద్యార్థులు ఇక్కడికి వచ్చారని తరగతి గదే విద్యార్థులకు ఆలయం లాంటిదన్నారు. లక్ష్యం సాధించేంత వరకు ఇక్కడి ప్రొఫెసర్లు, లెక్చరర్లు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. హాస్టల్‌లో, కళాశాలలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కారం చూపుతానన్నారు. ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు అంతా యువకుల్లా ఉన్నారని రాష్ట్రంలోనే కామారెడ్డి కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు మాట్లాడారు.



మొదటి రోజు తరగతి గదిలో పాఠాలు వింటున్న మెడికల్ విద్యార్థులు

చాలా ఆనందంగా ఉంది



మొదటి రోజు కొత్త మెడికల్ కళాశాలలో అడుగు పెట్టినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇక కష్టపడి చదువుతా. అందరితో స్నేహభావంతో కలిసి ఉంటాను. ప్రొఫెసర్లు, లెక్చరర్లు, తోటి విద్యార్థులు చాలా బాగా సహకరిస్తున్నారు.

– శ్రావణి, జోగిపేట

మేమే మొదటి బ్యాచ్..



కామారెడ్డి మెడికల్ కళాశాల నూతనంగా ప్రారంభం కావడం, మేమే మొదటి బ్యాచ్ కావడం చాలా ఆనందంగా ఉంది. మేమే సీనియర్స్ అన్న మాట. నెక్స్ వచ్చే వారంతా మాకంటే జూనియర్సే. ఇక్కడి వాతావరణం చాలా బాగుంది. మొదటి రోజు చాలా ఎంజాయ్ చేశాం.

– అనన్య, హైదరాబాద్

ఇక్కడ బాగుంది



కామారెడ్డి నాకు చాలా నచ్చింది. ఇక్కడి వారు కూడా మమ్మల్ని చాలా బాగా చూసుకుంటూ మాట్లాడుతున్నారు. ఇక్కడ ఉంటే మా ఇంట్లో ఉన్న ఫీలింగ్ వచ్చింది. ఫ్యాకల్టీ కూడా బాగానే ఉన్నారు. చదువులో రాణించి లెక్చరర్స్ మన్ననలు పొందుతా.

– సచిన్, ఢిల్లీ

కష్టపడి చదువుతా..



కామారెడ్డి నూతన కళాశాలలో నాకు సీటు రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నా. చదువులో కష్టపడ్డందుకు ఫలితం దక్కింది. ఇంకా చాలా కష్టపడాల్సింది ఉంది. మొదటి రోజే ఇక్కడి విద్యార్థులం, లెక్చరర్స్ ఫ్రెండ్స్‌లాగా కలిసిపోయాం. ఇదే అనుభూతితో ఎంబీబీఎస్ సక్సెస్‌గా పూర్తి చేస్తా.

– దేవిక, మేడ్చల్

స్నేహపూర్వకంగా ఉన్నారు



నేను కేరళ నుంచి వచ్చాను. నాకు తెలుగు, హిందీ భాషలు రావు. కానీ ఇక్కడి విద్యార్థులు, ప్రొఫెసర్స్, సిబ్బంది చాలా బాగా స్నేహపూర్వకంగా మాట్లాడుతున్నారు. కొత్త వారిలా కాకుండా పాత వారిలా కలిసిపోతున్నారు. ఇక్కడ వాతావరణం కూడా నాకు బాగా నచ్చింది. ఫుడ్ చాలా బాగుంది. మా తల్లిదండ్రుల లక్ష్యాన్ని నేరవేర్చుతా.

– జెర్రిన్, కేరళ

ఉత్తమ వైద్యులుగా తీర్చిదిద్దుతాం



కామారెడ్డికి నూతనంగా వచ్చిన మెడికల్ విద్యార్థులు చాలా చురుకుగా ఉన్నారు. నూతన కళాశాల, మొదటి బ్యాచ్ విద్యార్థులు చాలా సంతోషంగా వచ్చారు. ఇక్కడి ఫ్యాకల్టీ అంతా అనుభవజ్ఞులే..విద్యార్థులను ఉత్తమ వైద్యులుగా తీర్చిదిద్దుతాం.

– డాక్టర్ సంతోష్ కుమార్, ఈఎన్‌టీ, అసిస్టెంట్ ప్రొఫెసర్

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో అఖిల ప్రతిభ



కామారెడ్డి అర్బన్ : వరంగల్ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఉమెన్ లీగ్–2023 చాంపియన్ షిప్ పోటీల్లో కామారెడ్డి జిల్లాకు చెందిన ఎల్ అఖిల 1500 మీటర్ల పరుగులో ప్రథమంగా నిలిచి గోల్డ్‌మెడల్ సాధించిందని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



గాంధారి(ఎల్లారెడ్డి) : ప్రతి జీపీలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని కామారెడ్డి డీపీవో శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మండల పరిధిలోని వండ్రికల్, గుర్జాల్ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా వండ్రికల్ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గుర్జాల్‌లో ఇంటింటికీ తిరిగి ఇంటి పన్నులు వసూలు చేశారు. డీపీవో స్వయంగా ఇంటి పన్ను రసీదులను అందజేశారు. వందశాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీవో రాజ్‌కిరణ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులున్నారు.

గిరి వికాసం లబ్ధిదారుల వివరాలు సేకరించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



కామారెడ్డి క్రైం : పోడు పట్టాలు పొందిన లబ్ధిదారుల సమగ్ర వివరాలను మండలస్థాయి అధికారులు సేకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం మండలస్థాయి అధికారులతో గిరి వికాసం పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇద్దరి నుంచి అయిదుగురి వరకు ఈ పథకంలో లబ్ధిదారులుగా ఉండవచ్చన్నారు. లబ్ధిదారుల భూమి ఐదెకరాల వరకు ఉండాలన్నారు. వారికి విద్యుత్, సాగు నీటి వసతి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సౌకర్యం కోసం లబ్ధిదారులు మీ సేవలో రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, డీఏవో భాగ్యలక్ష్మి, భూగర్భ జలశాఖ అధికారి సతీష్ యాదవ్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, అధికారులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ కోర్టు జడ్జిగా సాయిశ్రీ



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పద్మ సాయిశ్రీకి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఫస్ట్ అడిషనల్ కోర్టు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా గురువారం నియామకమైనట్లు స్థానికులు తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన సాయిశ్రీ ఇటీవల వెలువడిన ఫలితాల్లో న్యాయమూర్తిగా ఎంపికైందన్నారు. న్యాయమూర్తిగా ఎంపికైన సాయిశ్రీకి హైకోర్టు హుజూరాబాద్ ఫస్ట్ అడిషనల్ కోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మొదటి పోస్టింగ్ పొందిన సాయిశ్రీని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్, న్యాయవాదులు పండరి, సతీష్, సాయిబాబా, శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు.

భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాలి

కామారెడ్డి రూరల్ : తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నప్పుడు ఉపాధ్యాయులు తమ సొంత భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాలని డీఈవో ఎస్ రాజు అన్నారు. 'లర్నింగ్ కర్వ్ స్వచ్ఛంద సంస్థ' ద్వారా గురువారం కామారెడ్డి పట్టణ పరిధిలోని టేక్రియాలలో జిల్లాలోని కేజీబీవీ ఉపాధ్యాయులకు సామాజిక భావోద్వేగ నైపుణ్య శిక్షణతో పాటు తరగతిలో బోధన, సహానుభూతి, స్వీయ అవగాహన మెళకువలపై శిక్షణ నిర్వహించారు. ఆరు నుంచి 9వ తరగతి విద్యార్థుల్లో కలిగే మార్పులను తరుచూ గమనిస్తు వారు ఎలా ప్రవర్తించాలో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో లర్నింగ్ కర్వ్ రిసోర్స్ పర్సన్‌లు ఉమారాణి, స్వప్న, తులసి, కేజీబీవీ అధికారులు లావణ్య, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ విద్య కీలకం



బాన్సువాడ: విద్యార్థులకు ఇంటర్ విద్య కీలకమని జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. గురువారం బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీకి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ రఘు, వైస్ ఎంపీపీ కాశీరాం, ఎంపీటీసీ సందీప్, అధ్యాపకులు చంద్రశేఖర్, దేవిసింగ్, శ్యాం సుభాష్, నారాగౌడ్, సంగీత, సౌజన్య, రజాక్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం రోడ్డులో గల మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఫిజికల్ సైన్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కౌసర్ బేగం తెలిపారు. ఔట్ సోర్సింగ్ బేస్‌లో విద్యాసంస్థ నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.35వేల వేతనం ఉంటుందని, బీఈడీ, పీజీ పూర్తి చేసిన వారు ఈనెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

19 మంది బైండోవర్



పెద్దకొడప్‌గల్(జుక్కల్): రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని 19 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై కోనారెడ్డి గురువారం తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియామవళిని పాటించాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వరిలో మొగి పురుగు ఉధృతిని నివారించాలి



రామారెడ్డి: వరిలో మొగి పురుగు ఉధృతిని నివారించాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని ఇస్సన్నపల్లిలో వరి పంటలను ఆమె పరిశీలించారు. మొగి పురుగు నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైట్ 400 గ్రా. లేదా క్లోరంత్రనిలిప్రోల్ 60ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. ఏవో హరీష్ కుమార్, ఏఈవో రాకేష్, రైతులు కందూరి చిన్న లింబద్రి, చత్రబోయిన శంకర్ పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్..



పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువజన సంఘాల మండపాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సాప్ నం..
96039 39111



సాయిలు, శంకర్, లక్ష్మీనారాయణ, కామారెడ్డి



మణికంఠ, సాయిరిషి, విద్యుత్‌నగర్, కామారెడ్డి



గంప అనిల్, పీఎంహెచ్ కాలనీ, కామారెడ్డి



నాగరాజు, టేక్రియాల్



పార్మి సంతోష్, వీక్లీమార్కెట్, కామారెడ్డి



సంస్కృతి, రుద్రాంశ్, ఎన్జీవోస్ కాలనీ, కామారెడ్డి



తేజ, శేర్‌గల్లి, కామారెడ్డి



సాత్విక్ సాయి, రిత్విక్ సాయి, కామారెడ్డి



ప్రశాంత్, బిచ్కుంద



దివిజ, కామారెడ్డి



జంగం నరేష్, కామారెడ్డి



పవన్, భరత్, శ్రీనివాస్, కామారెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారంలో కేసీఆర్ విఫలం

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యాయని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు ప్రభాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములు, దళిత, బీసీ, మైనార్టీ బంధు, నిరుపేదలకు గృహలక్ష్మి, అటవీ హక్కుల చట్టం అమలు, వ్యవసాయ కార్మికులకు జీవనభృతి, నిరుద్యోగ భృతి, ఇలా ప్రధానమైన హామీలను నేరవేర్చకుండా ప్రజల్ని మోసం చేశారన్నారు. జిల్లా కార్యదర్శి రామకృష్ణ, బాల్‌రాజు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, నాయకులు పరమేష్, నారాయణ, దేవిదాస్, సుశీల్, బాబన్న, కిశోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్

మున్నూరు కాపులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవన్న

బిచ్కుంద(జుక్కల్): అన్ని రంగాల్లో వెనకబడి ఉన్న మున్నూరు కాపులను ప్రభుత్వం ఆదుకోవాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న అన్నారు. గురువారం బిచ్కుందలో జుక్కల్ నియోజక వర్గ మున్నూర్ కాపుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాలు మున్నూరుకాపుల అభివృద్ధికి ఎలాంటి కృషి చేయకపోవడంతో అన్ని రంగాల్లో వెనకబడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మున్నూరు కాపులకు టిక్కెట్ ఇచ్చి రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నాయకులు పురుషోత్తంరావు, మణికొండ, బాజిరెడ్డి జగన్, మామిళ్ల అంజయ్య, గడ్డం అరవింద్, బొమ్మల లక్ష్మణ్, మొగులయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సివిల్ జడ్జీల బదిలీలు, నియామకాలు

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ జడ్జీలను బదిలీ చేస్తూ మరికొందరిని నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కామారెడ్డి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా(మొబైల్ కోర్టు) బి దీక్షను నియమించారు. నిజామాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీగా విధులు నిర్వహిస్తున్న కుష్బు ఉపాధ్యాయ్‌ను నిజామాబాద్ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి(నిజామాబాద్ బాలల న్యాయ మండలి)గా బదిలీ అయ్యారు. నిజామాబాద్ రెండో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గోపీకృష్ణను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీగా నియమితులయ్యారు. ఇద్దరిని స్థానికంగానే బదిలీ చేశారు. ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేములను ఆర్మూర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీగా నియమించారు. బోధన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రూబినా ఫాతిమాను హైదరాబాద్ కూకట్‌పల్లి కోర్టుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో మర్కల్ పూజితను నియమించారు. బోధన్ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జీగా ఎస్సంపల్లి సాయి శివ, ఆర్మూర్ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జీగా మెల్లమ్ రేష్మ నియమితులయ్యారు.

చిన్నారులతో దొంగతనాలు

వర్ని: మండల కేంద్రంలో చిల్లర దొంగతనాలకు చిన్నారులను వాడుకుంటున్న ఘటన వెలుగులోకి వచ్చింది. గురువారం తెల్లవారుజామున ఓ ప్రైవేటు పాఠశాల నుంచి బుట్టలను చిన్నపిల్లలతో దొంగతనం చేయించిన ఘటన సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఇటీవల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చిల్లర దొంగతనాలు ఎక్కువయ్యాయి. చిల్లర దొంగతనాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేట్ ల్యాబ్‌లో తప్పుడు రిపోర్టు

కామారెడ్డి టౌన్: లింగంపేట్‌లోని ఓ ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో రక్త పరీక్ష చేయించుకున్న మహిళకు తప్పుడు రిపోర్టు ఇచ్చారు. లింగంపేట మండలం కన్నాపూర్ తండాకు చెందిన రాంకీ అనే మహిళలకు తీవ్రంగా జ్వరం రావడంతో ఈనెల 20న మండల కేంద్రంలో ప్రైవేట్ ల్యాబ్‌లో రక్త ఫలికలు, బ్లడ్ గ్రూప్ పరీక్షలను చేయించారు. మహిళ బ్లడ్ గ్రూప్ 'ఏ' నెగటీవ్‌గా, తెల్లరక్తకణాలు పడిపోయినట్లుగా రిపోర్టు ఇవ్వడంతో ఆందోళనకు గురై జిల్లా కేంద్ర ఆస్పత్రికి వచ్చారు. గురువారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ల్యాబ్‌లో పరీక్షలు చేయగా బ్లడ్ గ్రూప్ ఏ పాజిటివ్‌గా, తెల్లరక్తకణాలు భాగానే ఉన్నాయని నిర్ధారించి రిపోర్టు ఇచ్చారు. బాధితురాలి కుమారుడు పందునాయక్ మాట్లాడుతూ తప్పుడు రిపోర్టు ఇచ్చిన ల్యాబ్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తానా కవయిత్రుల సమ్మేళనానికి కల్పన



బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్టలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కల్పన దేవసానికి తానా అంతర్జాతీయ కవయిత్రుల సమ్మేళనంలో పాల్గొనే అవకాశం లభించింది. ఈనెల 24న ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న నారీ సాహిత్య భేరి, అంతర్జాతీయ శతధిక కవయిత్రుల సమ్మేళనంలో పాల్గొనడానికి ఆహ్వానం వచ్చిందన్నారు.

గుండెపోటుతో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మృతి



లక్ష్మీపతి (ఫైల్)

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబ్బుల లక్ష్మీపతి(68) గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన చాలా కాలం పాటు కామారెడ్డి గంజు వర్తక సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ నెల 20న జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సర్వసభ్య సమావేశంలో సైతం ఆయన పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

ఖలీల్‌వాడి: నగరంలోని జీజీ కళాశాల సమీపంలో గంజాయి తాగుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. వీరి నుంచి 300 గ్రాముల గంజాయిను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సోయా పంట పరిశీలన

మద్నూర్(జుక్కల్): సోయాబీన్ పంటకు కాండపు ఈగ సోకడంతో పంట దెబ్బతింటోందని ఏరువాక శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. 'సోయాకు వింత వైరస్ దెబ్బ' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి ఏరువాక శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు స్పందించారు. మండలంలోని కోడిచిర, పెద్ద తడ్గూర్ గ్రామాల శివారులో వైరస్ సోకి ఎండిపోతున్న సోయాబీన్ పంటను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు అనిల్‌రెడ్డి, రేవంత్, ఏడీఏ నూతన్‌కుమార్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కాండపు ఈగ నివారణకు క్లోరోన్‌ట్రనిప్రోల్, ల్యామ్డా అంప్లిగో మందును 80 మి.లీ. ఎకరాకు స్ప్రే చేయాలని లేదా థియోమెథాక్సం, ల్యామ్డాసైలోత్రిన్ 100 మి.లీ మందును ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. కాయ కుళ్లు నివారణకు పైరక్లోస్ట్రోబిన్ లేదా ప్రోపికోనజోల్(టిల్ట్) పిచికారి చేయాలన్నారు. ఏవో రాజు, మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, ఏఈవోలు సతీష్, అనిల్, సంయుక్త, శ్రీలేఖ, ప్రియాంక, భాజన్న పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..



కోడిచిరలో వైరస్ సోకిన సోయా పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని రాస్తారోకో

కామారెడ్డి టౌన్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేస్తే ఎంఎస్‌పీ పార్టీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. 20 ఏళ్లుగా పోరాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తం, లక్ష్మి, సాయి, శ్రీకాంత్, ప్రసాద్, శివరాజు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు నిజామాబాద్ ఆర్సీవో అలివేలు గురువారం తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి 5 నుంచి 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 23న తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశాల్లో కేవలం ఎస్సీ విద్యార్థులచే మాత్రమే ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం (బి) లో ఉన్న ఆర్‌సీవో కార్యాలయంలో ఈ తక్షణ ప్రవేశాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్, ఎంపిక పత్రం, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బోనాఫైడ్, ఆధార్‌కార్డులతో హాజరు కావాలన్నారు. అనాథలు, పాక్షికంగా అనాథలైన, దివ్యాంగ విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శునకం తల్లి ప్రేమ



పిట్లంలో ఓ కుక్క గేదె దూడకు తల్లి ప్రేమను పంచి పెట్టింది. స్థానిక రైతు సురేందర్ వ్యవసాయ క్షేత్రంలో ఓ కుక్క పాలను గేదె దూడ తాగడం చూపరులను ఆకట్టుకుంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

రాజంపేట: సంతాయిపేట గ్రామానికి చెందిన రాజు పంతులు ఆవు మండలంలోని అన్నారం పరిధిలో గడ్డి మేయడానికి వచ్చి పొలంలో తెగి పడి ఉన్న విద్యుత్ వైర్‌కు తగలడంతో చనిపోయింది.

అయ్యపల్లిలో తండాలో గేదె..

లింగంపేట: మండలంలోని అయ్యపల్లితండాకు చెందిన దేవసోత్ శంకర్‌కు చెందిన పాడి గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. పంట చేను వద్ద సర్వీసు వైరు తెగిపడడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు.

క్రైం కార్నర్

భార్య చేతిలో భర్త హతం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌లో భర్తపై భార్య పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన ఘటనలో భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామానికి చెందిన వేముల రాజు(30) తన భార్య సుజాతను మద్యం సేవించడానికి డబ్బులు కావాలని నిత్యం కొడుతూ వేధించేవాడు. బాధ భరించలేక సుజాత ఈ నెల 11న మధ్యాహ్నం రాజు ఇంట్లో నిద్ర పోతున్న సమయంలో అతనిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టింది. దీంతో రాజుకు మంటలు అంటుకోగా కాలిపోయాడు. సుజాత ఈ ఘటనను ప్రమాదంగా చిత్రీకరించడానికి ప్రయత్నించింది. చావుబతుకుల మధ్య ఉన్న రాజును కుటుంబ సభ్యులతో కలిసి ఆస్పత్రికి తరలించింది. వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజు బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుని భార్య సుజాతపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట కాలనీ వద్ద అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 6 గంటల ప్రాంతంలో రామారెడ్డి రోడ్డు నుంచి బతుకమ్మ కుంట వెళ్లే దారిలో ఓ టాటాఏస్ వాహనంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు పట్టణ పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు దాడులు నిర్వహించారు. వాహనాన్ని అడ్డుకుని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసిల్దార్ కిష్టయ్య విచారణ జరిపారు. వాహనంలోని మొత్తం 41 బస్తాలలో 19.10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. పట్టణానికి చెందిన అజీజ్ ఖాన్ అనే వ్యక్తి ఇక్కడ నుంచి నిజామాబాద్‌కు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అతనిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని డీటీ కిష్టయ్య తెలిపారు.

తోపులాటలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని యానంగుట్ట వద్ద అన్నదమ్ముల మధ్య జరిగిన తోపులాటలో అన్న రాజా రెడ్డి(40) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు బుధవారం తెలిపారు. ఆర్మూర్‌కు చెందిన రాజారెడ్డి, రాజ్‌కుమార్ అన్నదమ్ములు. ఇరు కుటుంబాల మధ్య కొన్ని రోజులుగా గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో రాజారెడ్డి బుధవారం పొలంలో తమ్ముడు రాజ్‌కుమార్ భార్యతో గొడవ పడ్డాడు. రాజ్ కుమార్ సైతం అక్కడే ఉండడంతో ఘర్షణ నెలకొంది. ఇద్దరి మధ్య జరిగిన తోపులాటలో రాజారెడ్డి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

లారీల మధ్య ఇరుక్కుని కూలీ..

కామారెడ్డి క్రైం: రెండు లారీల మధ్య ఇరుక్కుని బీహార్ కూలీ మృతి చెందిన ఘటన కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆవరణలో బుధవారం చోటు చేసుకుంది. బీహార్‌కు చెందిన సంతోష్ కుమార్ (22) కొన్ని రోజులుగా కామారెడ్డిలో ఉంటూ తోటి వారితో కలిసి రైలు వ్యాగన్ నుంచి సరుకులు, బస్తాలను లోడింగ్ చేసే కూలీగా పని చేస్తున్నాడు. వ్యాగన్‌కు దగ్గరగా ఓ లారీని చేర్చుతున్న సమయంలో మరో లారీ ప్రమాదవశాత్తు ఢీకొనడంతో సంతోష్ లారీల మధ్య ఇరుక్కుని మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కలను తప్పించబోయి ఆటో బోల్తా

- ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు



నిజాంసాగర్(జుక్కల్): నాందేడ్- సంగారెడ్డి జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ఆటో వీధికుక్కలు అడ్డు రావడంతో బోల్తాపడి తీవ్ర ప్రమాదం నెలకొంది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందారు. గురువారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన ఆటోడ్రైవర్ సంతోష్ తన అమ్మ యశోదాబాయి(50)తో కలిసి దెగ్లూర్‌లోని చెల్లెలు వద్దకు ఆటోలో బయలు దేరాడు. మార్గంలో ప్రయాణికులను ఎక్కించుకుంటూ హైవేపై వెళ్తున్నాడు. నిజాంసాగర్ మండలం బ్రహ్మణపల్లి అంజనాద్రి సమీపంలో జాతీయ రహదారిపైన వీధికుక్కలు ఆటోకు అడ్డు వచ్చాయి. సడన్ బ్రేక్ వేయడంతో వేగంగా ఉన్న ఆటో రహదారిపై పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో యశోదాబాయితో పాటు దాసరి రాములు (70) తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నారు. సంతోష్‌తో పాటు మరో నలుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో యశోదబాయి మృతి చెందింది. దాసరి రాములును నారాయణఖేడ్‌ను ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రాజశేఖర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తరలించారు. మృతుల కుటుంబీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పంచానామా నిర్వహించామని ఎస్సై తెలిపారు. అతివేగంగా ఆటోను నడిపిన సంతోష్ పైన కేసు నమోదు చేశామన్నారు.

రెండు బైకులు ఢీ

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్ వద్ద గురువారం రెండు బైక్‌లు ఢీకొనడంతో నలుగురికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నిజామాబాద్ మండలం న్యాల్‌కల్ గ్రామానికి చెందిన మహిపాల్ సాటాపూర్‌లో పనులు ముగించుకుని బైక్‌పై వెళ్తుండగా కళ్యాపూర్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో దండిగుట్టకు చెందిన ప్రకాశ్, వెంకటేశ్‌తో పాటు వీరన్నగుట్టకు చెందిన మీరజ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వెంకటేశ్‌కు తలకు తీవ్ర గాయం కాగా, కాళ్లు విరిగిపోయాయి. ఈ ఘటనలో బైకులు చెల్లాచెదురు పడగా రోడ్డు పక్కన నిల్చున్న ఓ మహిళకు బైక్ తగలడంతో తీవ్రగాయాలైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.